ప్రజాశక్తి

మంగళవారం 4 నవంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

గిరిజన ఉన్నత విద్యకు ఎసరు?

- ఏడాదిగా మూతపడిన మారికవలస రెసిడెన్షియల్ కళాశాల
- ఆదివాసీల ఐఐటి, ఎన్ఐటి, ఎంబిబిఎస్ శిక్షణ అడ్మిషన్లకు బ్రేక్!



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వెనుకబడిన గిరిజన ప్రాంత విద్యార్థుల ఉన్నత విద్య శిక్షణ కేంద్రాన్ని రాష్ట్రంలోని 'కూటమి' సర్కార్ అటకెక్కించే యత్నాలు చేస్తోంది. విశాఖ జిల్లా మధురవాడ-మారికవలసలోగల ట్రైబల్ హాస్టల్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏడాది కాలంగా మూసివేయడంతో పలువురు గిరిజన విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరమయ్యే



నూతనంగా నిర్మించి అప్పగించని భవనం

పరిస్థితులు దాపురించాయి. ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ ఆధ్వర్యాన 'స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్సీ' పేర విశాఖ ఏజెన్సీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ తొలి సంవత్సరంలో ఉత్తమంగా రాణించిన విద్యార్థులకు ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ పరీక్షలు నిర్వహించడం ద్వారా టాప్ -10లో మిగిలిన వారిని ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. మారికవలసలోగల ఈ రెసిడెన్షియల్ కాలేజీ ప్రస్తుతం మూతపడడంతో గిరిజన ప్రాంత విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు.

ఉన్నత విద్యలో గిరిజనులకు భరోసా ఈ కేంద్రం...

ప్రతి ఏటా 80 నుంచి 100 మంది విద్యార్థులకు ఐఐటి, ఎన్ఐటి, నీట్, లాసెట్ వంటి ఉన్నత స్థాయి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక సిబ్బంది ద్వారా శిక్షణ ఇచ్చేవారు. ఆయా సంస్థల్లో గిరిజన విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు ఈ ట్రైనింగ్ బాగా ఉపయోగపడేది. తాజాగా ఈ శిక్షణా కేంద్రాన్ని మూసివేయడంతో అంతటా చర్చనీయాంశంగా మారింది. ఈ కేంద్రం ద్వారా గతంలో ఒక్కో గిరిజన విద్యార్థికి రూ.20వేలు వ్యయంతో 7 నెలల పాటు శిక్షణ ఇచ్చేవారు. 2018-2024 మధ్యకాలంలో ఏటా 100 మంది విద్యార్థులకు ఉన్నత విద్యకోసం ఇక్కడ శిక్షణ లభించేది. ఇప్పటివరకూ 5గురు ఐఐటి, 25 మంది లాసెట్, 26 మంది నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. గడచిన ఏడాది నుంచి సుమారు ఏడుగురు టీచర్లు, సిబ్బందికి జీతాలు చెల్లించలేదు. ట్రైనింగ్ కొనసాగడానికి నిధులను పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆ శిక్షణా కేంద్రం మూతపడింది. మొత్తంగా 'కూటమి' ప్రభుత్వం గిరిజనుల ఉన్నత విద్య పట్ల నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి తెలియజేసినా 'స్పాన్సర్'లను వెతుక్కోవాలంటూ ప్రభుత్వం చెప్పడంతో ఫండ్స్‌లేవని ఇక్కడి సిబ్బంది వాపోతున్నారు. దీంతో కొత్త అడ్మిషన్లు

మిగతా 2లో..

జనాభాకనుగుణంగా నిర్మాణాలు

◆ క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పో కర్టెనరైజర్ ఈవెంట్‌లో విశాఖ కలెక్టర్ ఎంఎన్.హరేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : పెరుగుతున్న జనాభాకనుగుణంగా నిర్మాణాలు జరగాలని క్రెడాయి ప్రతినిధులకు విశాఖపట్నం కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ సూచించారు. ఎంవిపి.కాలనీలోని గాదిరాజు పాలస్ అండ్ కన్వెన్షన్ సెంటర్‌లో డిసెంబర్ 19 నుండి 21వ తేదీ వరకు నిర్వహించనున్న 11వ క్రెడాయి విశాఖపట్నం ప్రాపర్టీ ఎక్స్‌పో-2025కు సంబంధించి కర్టెన్‌రైజర్ కార్యక్రమాన్ని సోమవారం విశాఖలోని ఓ హోటల్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కర్టెన్-రైజర్ ఈవెంట్‌ను విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. క్రెడాయి విశాఖపట్నం అధ్యక్షుడు ఇ.అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, గడిచిన 10 ఎక్స్‌పోల మాదిరిగా 11వ ఎక్స్‌పో కూడా విజయవంతం కావాలన్నారు. ఈ ఎక్స్‌పో రానున్న రోజుల్లో విశాఖ నగరం అభివృద్ధికి సహాయపడుతుందని తెలిపారు. విశాఖకు త్వరలో ఎన్నో నూతన ప్రాజెక్టులు రానున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో డేటా సెంటర్ విశాఖ వస్తుందని తెలిపారు. నూతన రైల్వే జోన్‌కు ప్రధానమంత్రి మోడీ పునాదివేశారని, ఇప్పటికే టిసిఎస్ తమ కార్యకలాపాలను ప్రారంభించిందని, త్వరలోనే కాంగినేజెంట్ రానుందని, తద్వారా రానున్న రోజుల్లో మరిన్ని ఉపాధి అవకాశాలు పెరగనున్నాయని వివరించారు. తక్కువ ధరలకు భూములు కేటాయించడం, త్వరతగతిన అనుమతులు మంజూరు చేయటం ద్వారా నూతన సంస్థలు, ప్రాజెక్టులు విశాఖకు వస్తున్నాయని, కేవలం ఐటి సెక్టర్ మాత్రమే కాకుండా, భోగాపురం ఎయిర్

మిగతా 2లో..



క్రెడాయి కర్టెనరైజర్ ఈవెంట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

సేవా దృక్పథంతో వైద్య విద్యనభ్యసించాలి

▶ వార్త 2లో..

మహిళా క్రికెట్ టీమ్‌కు జిద్వా జేజేలు

▶ వార్త 2లో..

10 నుంచి ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ పోటీలు

▶ వార్త 2లో..

అదాని సిమెంట్ అనుమతులు రద్దుచేయాలి

▶ వార్త 4లో..

6న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 6న చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరుగుతాయని సిఇఒ పి.నారాయణమూర్తి తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కొన్ని, చైర్‌పర్సన్ ఛాంబర్‌లో కొన్ని స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని వివరించారు. 6, 3 స్థాయీ సంఘ సమావేశాలు 10:30 గంటలకు, 4వ స్థాయీ సంఘ సమావేశం 11 గంటలకు, 5వ స్థాయీ సంఘ సమావేశం 11:30 గంటలకు, 6, 7, 1 స్థాయీ సంఘ సమావేశాలు 12 గంటలకు జరుగుతాయని తెలిపారు. జెడ్‌పిటిసి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

జివిఎంసిలో 9 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : జివిఎంసిలో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న 9 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పిస్తూ మేయర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రమోషన్ పొందిన ఉద్యోగులు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. అంకిత భావంతో పని చేయాలని, బాధ్యతను విస్మరించకుండా తెలియని విషయాలను అధికారుల నుండి సూచనలు, సలహాలు తీసుకొని విధులు నిర్వహిస్తూ జివిఎంసికి మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ప్రమోషన్ పొందిన వారిలో వి.వీరబాబు, ఎ.రామునాయుడు, జి.శేఖర్, ఎన్.శ్రీను, యు.లలితాంబిక, ఎబి.కేతిరిన్, రాజేంద్రప్రసాద్, ఎన్.నవితేజ్, వి.రమేష్ కుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 413 వినతులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ఫిర్యాదుదారులతో సంబంధిత శాఖల జిల్లాస్థాయి అధికారులే నేరుగా మాట్లాడాలని, దిగువ స్థాయి సిబ్బంది మాట్లాడ్డానికి వీల్లేదని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తేల్చి చెప్పారు. ఆడిట్ నివేదికల పరిశీలన, ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి వచ్చిన స్పందన, సంతృప్తి తదితర నివేదికల సునిశిత పరిశీలన అనంతరం కలెక్టర్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇతర అధికారులతో, సిబ్బందితో ఫోన్లు చేయించి తూతూమంత్రంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వడానికి వీల్లేదని చెప్పారు. గతంలో వచ్చిన ఫిర్యాదులు, అధికారులు తీసుకున్న చర్యలు, ఇచ్చిన నివేదికలను పరిశీలించిన ఆయన అధికారులు ఫిర్యాదుల పరిష్కారంలో మరింత చొరవ చూపాలని, కాలయాపన చేయకుండా నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో జాయింట కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

413 వినతులు సమర్పించిన ప్రజలు

పిజిఆర్ఎస్‌కు వివిధ సమస్యలపై 413 వినతులను ప్రజలు సమర్పించారు. రెవెన్యూ విభాగానికి చెందినవి 148, జివిఎంసి 126, పోలీస్ శాఖ -32, ఇతర శాఖలకు సంబంధించినవి 107 ఫిర్యాదులు ఉన్నాయి.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విఎంఆర్‌డిఎ కార్మికులు

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

విఎంఆర్‌డిఎ పరిధి పార్కుల్లో పనిచేస్తున్న 18 మంది గార్డెన్ తోటమాలి కార్మికులను అన్యాయంగా తొలగించారని, ఏడాది గడుస్తున్నా విధుల్లోకి తీసుకోకపోవడాన్ని ఉడా ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి కార్మికులు తమ కష్టాన్ని చెప్పుకున్నారు.

పెదగంట్యాడలో అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతిపాదన వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సిపిఐ నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

మొదటి పేజీ తరువాయి..

గిరిజనుల ఉన్నత విద్యకు ఎసరు?

ఆగిపోయాయి. 'కూటమి' అధికారంలోకి వచ్చాక నిధులు ఇవ్వలేదు. కొత్త భవనం నిర్మాణం జరిగినా ఆ పనులకు బిల్లులనూ చెల్లించకపోవడం కనిపిస్తోంది.

బడ్జెట్ ఉంటే నిర్వహణ : డిటిడబ్ల్యు సురేష్‌కుమార్
మారికవలసలో గిరిజనుల ఉన్నత విద్య కోసం ఉద్దేశించిన ఐఐటి, నీట్, ఎన్ఐటి ట్రైనింగ్ సెంటర్ నిధుల కొరతను ఎదుర్కొంటున్నదున ఏడాది కాలంగా మూతపడిందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బి.సురేష్‌కుమార్ ప్రజాశక్తికి తెలిపారు. పాడేరు ఐటిడిఎ నిధులతో ఇది నడిచేదని, నిధుల్లేక ఆగినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తున్నాం : ప్రిన్సిపల్ శివప్రసాద్
నిధులు లేనందున గిరిజనుల ఉన్నత విద్యకు ఇక్కడ శిక్షణ నిలిచిపోయిందని, ప్రభుత్వం బడ్జెట్ మంజూరు చేస్తేనే కొనసాగుతుందని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ ప్రిన్సిపల్ శివప్రసాద్ ప్రజాశక్తికి సోమవారం తెలిపారు. అదే సందర్భంలో నూతన భవనం ఒకటి నిర్మాణం అయిందని, బిల్లులు పెండింగ్ వల్ల కాంట్రాక్టరు తమకు అప్పగించడం లేదని తెలిపారు. గిరిజనుల ఉన్నత విద్య ట్రైనింగ్ కోసం ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు ఫైల్ ద్వారా తెలియజేస్తున్నామని చెప్పారు.

జనాభాకనుగుణంగా నిర్మాణాలు

పోర్టు, అనకాపల్లి సమీపంలో బల్క్ డ్రగ్ పార్క్, వంటి ప్రాజెక్టుల ద్వారా విశాఖపట్నం పరిసరాలలో పెరుగునున్న జనాభాకు అనుగుణంగా నిర్మాణాలు జరగాల్సి ఉందని, ఇందుకు క్రెడాయి చొరవ చూపాలని సూచించారు.

ఎస్‌బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ (బిజినెస్ అండ్ ఆపరేషన్స్) రాహుల్ సంక్రియ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో రియల్ ఎస్టేట్ సెక్టార్ 7.5 శాతం నుండి 15 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.

క్రెడాయి విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ వి.ధర్మేందర్ మాట్లాడుతూ, విశాఖపట్నంలో అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిస్తుందన్నారు. ఈ ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణాలకు ఎస్‌బిఐ ఆర్థికంగా సహకరిస్తూ వెన్నుముకగా నిలిచిందని తెలిపారు. కార్యదర్శి వి.శ్రీను మాట్లాడుతూ, ఈ ప్రాపర్టీ ఎక్స్‌పో నగర రియల్ ఎస్టేట్ రంగానికి గల ప్రాముఖ్యతను వివరించారు. ఎక్స్‌పో కన్వీనర్ సిహెచ్.గోవిందరాజు మాట్లాడుతూ, ఈ ఎగ్జిబిషన్‌లో నివాస, వాణిజ్య ప్రాజెక్టులను ప్రదర్శిస్తూ సుమారు 72 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్రెడాయి నేషనల్ ఎమర్జింగ్ సిటీస్ కన్వీనర్ రాజా శ్రీనివాస్, క్రెడాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గత చైర్మన్లు, స్పాన్సర్లు, ఎగ్జిబిటర్లు, బిల్డర్ల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో వైద్య విద్యనభ్యసించాలి

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైద్య విద్యను బాధ్యతతో, సామాజిక దృక్పథంతో అభ్యసించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. ఆంధ్ర వైద్య కళాశాలలో సోమవారం సాయంత్రం 'ఆహ్వాన్ 2025' ఫ్రెషర్స్ డే వేడుకలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫ్రెషర్స్ డే ద్వారా స్నేహ పూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. కొత్త విద్యార్థులు క్రమశిక్షణ, విలువలు, సృజనాత్మక ఆవిష్కరణలతో ముందుకు సాగాలని సూచించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజానికి సానుకూలంగా తోడ్పడాలని విద్యార్థులకు సూచించారు. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎస్ఎం.సంధ్యాదేవి మాట్లాడుతూ 250 మంది వైద్య విద్యార్థులు కొత్తగా తమ కుటుంబంలో చేరారని, వారి ప్రయాణం ప్రజలకు విలువైన సేవలందించే విధంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.మన్మథరావు (అకడమిక్), డాక్టర్ ఎ.కృష్ణవేణి (జనరల్ వైస్ ప్రిన్సిపల్), డాక్టర్ శ్యామల (కల్చరల్ వైస్ ప్రెసిడెంట్) పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ టీమ్‌కు ఐద్వా జేజేలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై భారత్ ఘన విజయం సాధించి తొలిసారిగా ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన భారత మహిళా క్రికెట్ జట్టుకు ఐద్వా విశాఖ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి ఒక ప్రకటనలో హర్షం ప్రకటించి, అభినందనలు తెలిపారు. భారత మహిళా క్రికెట్ జట్టు ప్రదర్శన దేశ ప్రజలందరికీ గర్వకారణం అని పేర్కొన్నారు. టోర్నీ మొత్తం సమష్టిగా రాణించి ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధించారని తెలిపారు. ఈ విజయం దేశంలోని ప్రతి మహిళకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఈ ఉత్సాహంతో మరెందరో మహిళలు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. మహిళలు కేవలం వంటగదికే పరిమితం కాదని, అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాలలో రాణిస్తారనడానికి మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ సాధించడమే ఉదాహరణ అని వివరించారు. ఉన్న అరకొర అవకాశాలతోనే మహిళా క్రికెటర్లు వరల్డ్ కప్ సాధించడం ముదావహం అని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్లే గ్రౌండ్స్ ఏర్పాటు చేయడం, క్రీడలకు బడ్జెట్ కేటాయింపులు పెంచడం, విద్యాలయాలలో క్రీడలను ప్రోత్సహించడం, అన్ని స్పోర్ట్స్‌లోనూ మహిళలను ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేయడం, మహిళా క్రీడా కారులను లైంగిక వేధింపుల నుండి రక్షణ కల్పించడంతో పాటు వారి పట్ల వివక్షత లేకుండా కఠిన చర్యలు తీసుకోగలిగితే మరింత మంది మహిళలు క్రీడల్లో రాణిస్తారన్నారని, మరిన్ని విజయాలను దేశానికి అందించగలుగుతారని పేర్కొన్నారు.

10 నుంచి ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఎంవిపి కాలనీలోని ఎస్-3 స్పోర్ట్స్ ఎరీనా వేదికగా ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ క్రీడలు నిర్వహించనున్నట్లు విశాఖపట్నం రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ వివిఎస్.జయశంకర్ తెలిపారు. ఎంవిపి.కాలనీలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ పోస్టల్ రీజియన్ ఆధ్వర్యాన 40వ ఆల్ ఇండియా పోస్టల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహిస్తామన్నారు. దీనికి సంబంధించిన లోగో, టీజర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ క్రీడల్లో దేశ వ్యాప్తంగా 14 రాష్ట్రాలకు చెందిన 14 టీమ్‌లు, 121 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. మెన్ సింగిల్స్, డబుల్స్, వుమెన్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. క్రీడా ఔత్సాహికులు, సంస్థలు, సాధారణ ప్రజలు ఈ టోర్నమెంట్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో విశాఖపట్నం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్‌విఎస్ఎన్.రాజు, డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్ పి.కోమల్‌కుమార్, రీజినల్ ఆఫీసు అసిస్టెంట్ డైరెక్టర్ కెవిడి.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

'నివేశ్ బస్ యాత్ర' ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : కెనరా రోబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ పెట్టుబడిదారుల విద్యా కార్యక్రమం 'నివేశ్ బస్ యాత్ర'ను సోమవారం విశాఖపట్నం నుండి ప్రారంభించింది. ఈ యాత్ర కర్నూలు, అనంతపురం, తిరుపతి, నెల్లూరు, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ (తెలంగాణ) నగరాల్లో పయనించి, స్థానిక నివాసితులకు, పెట్టుబడిదారులకు అవగాహన కల్పిస్తుందని కెనరా రోబెకో ఎఎంసి సేల్స్, మార్కెటింగ్ హెడ్ గౌరవ్ గోయల్ తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రజనీష్ నరులా మాట్లాడుతూ, నేటి ఆర్థిక రంగంలో, విజ్ఞానం అనేది శక్తివంతమైనదని వివరించారు. ఆర్థిక విద్యను సమాజాలకు నేరుగా తీసుకురావడమే 'నివేశ్ బస్ యాత్ర' లక్ష్యమని వివరించారు. పెట్టుబడుల సరళీకృతం, దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికను స్వీకరించడానికి ఈ యాత్ర సహాయపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

9న మాధవధార ట్రెక్కింగ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మాధవధార కొండపై ఈ నెల 9వ తేదీన ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నట్లు యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం నగర శాఖ చైర్మన్ ఆవాల పుండరీకాక్ష తెలిపారు. తొమ్మిదేళ్లు నిండిన ఆరోగ్య వంతులు ఎవరైనా ఈ ట్రెక్కింగ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. ఆదివారం ఉదయం 6:30 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ ట్రెక్కింగ్ సింహాచలం వద్ద ముగుస్తుందని వివరించారు. ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా చంద్ర శేఖర్ పండా, ఫీల్డ్ డైరెక్టర్‌గా హీరా సింగ్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్‌గా సి.హెచ్.సీతారామిరెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9703360044, 9866808873, 9949482818 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

కృష్ణ విగ్రహం తొలగింపు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జగదాంబ జంక్షన్‌లో ఏర్పాటుచేసిన సినీ నటుడు కృష్ణ విగ్రహాన్ని సోమవారం తొలగించారు. జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వెంటనే ఆయన స్పందించి తొలగింపజేశారు. దీనిపై మూర్తి యాదవ్ మాట్లాడుతూ, జగదాంబ జంక్షన్‌లో ఎనిమిది ఏళ్లుగా ఉన్న జనసేన జెండా దిమ్మ తొలగించి కృష్ణ విగ్రహం ఏర్పాటు చేశారని తెలిపారు. నిబంధనల మేరకు జివిఎంసి ఆమోదంతో బీచ్ రోడ్డులో ఇటువంటి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

జనసేన కార్యకర్త ఆగ్రహం
కృష్ణ అభిమానిగా తాను జగదాంబ జంక్షన్‌లో విగ్రహాన్ని ఏర్పాటుచేశానని 29వ వార్డు జనసేన నాయకుడు మన్యాల శ్రీనివాస్ మీడియాకు తెలిపారు. విగ్రహం ఏర్పాటు గురించి ఏడాది క్రితం జివిఎంసికి దరఖాస్తు చేసినట్లు చెప్పారు. నేటి వరకు అనుమతి ఇవ్వలేదని, వచ్చే నెలలో కృష్ణ వర్ధంతి కార్యక్రమం ఉన్న నేపథ్యంలో విగ్రహం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉండగా పవన్ కల్యాణ్ విశాఖపట్నం వచ్చిన సందర్భంలో కృష్ణ విగ్రహం ఏర్పాటుచేస్తామని చెప్పగా, ఆయన అంగీకరించారని తెలిపారు.

వైసిపి కమిటీ సభ్యులకు సత్కారం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : వైసిపి రాష్ట్ర కమిటీ చేపట్టిన నియామకాల్లో విశాఖపట్నం జిల్లా నుండి నియమితులైన సభ్యులను సోమవారం మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సత్కరించారు. క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కందిమల్ల రాజశేఖర్, అంగన్‌వాడీ విభాగం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఇప్పిలి పార్వతి, బిసి విభాగం జిల్లా కార్యదర్శిగా బొట్ట సింహాచలం, ప్రచార విభాగం జిల్లా కార్యదర్శిగా కనకాల కృష్ణ, జిల్లా ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌పాత్రో, మైనారిటీ విభాగం జిల్లా కార్యవర్గ సభ్యుడుగా మొహమ్మద్ షబ్బీర్ నియమితులయ్యారు. వారిని పార్టీ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని కోరారు.



వైసిపి క్రిస్టియన్ మైనారిటీ విభాగం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కందిమల్ల రాజశేఖర్‌ను సత్కరిస్తున్న కెకె.రాజు

రొమ్ము కేన్సర్‌పై అవగాహనకు
గీతంలో 'పింక్‌వాక్'



పింక్ వాక్‌లో పాల్గొన్న గీతం ప్రతినిధులు, విద్యార్థులు

ప్రజాశక్తి-మధురవాడ : మహిళలలో రొమ్ము కేన్సర్‌పై అవగాహనకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆవరణలో సోమవారం "పింక్‌వాక్" పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం ఉమెన్ లీడర్స్ ఫోరమ్, గీతం రోటరాక్ట్ క్లబ్, గీతం స్టూడెంట్ లైఫ్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమాన్ని గీతం ప్రో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావుప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, దేశంలో అధిక శాతం మహిళలు రొమ్ముకేన్సర్ బారిన పడుతున్నారని, దీన్ని ప్రాథమిక దశలో గుర్తించేందుకు వ్యాధి లక్షణాలపై అవగాహన, తక్షణమే వైద్యులను సంప్రదించడం ద్వారా కేన్సర్‌ను జయించవచ్చునని తెలియజేప్పడమే పింక్ వాక్ ఉద్దేశ్యమన్నారు. మహిళల జీవనశైలి, మంచి ఆరోగ్యపు అలవాట్లు ద్వారా రొమ్ము కేన్సర్‌ను దూరం పెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్ లైఫ్ అసోసియేట్ డీన్ అరుణ్‌కార్తిక్ తదితరులు పాల్గొన్నారు. పింక్ వాక్‌లో రొమ్ముకేన్సర్‌పై అవగాహన కలిగించే బ్యానర్లు, పోస్టర్లను విద్యార్థులు ప్రదర్శించారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్
జిల్లా అధ్యక్షుడిగా గుడాల

ప్రజాశక్తి- వేపగుంట : హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ విశాఖ, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా జివిఎంసి 90 వ వార్డు గోపాలపట్నం లక్ష్మీనగర్ చెందిన గుడాల జగన్నాధరావు నియమితులయ్యారు.కౌన్సిల్ నేషనల్ డైరెక్టర్ ప్రెసిడెంట్ కె.ఆనంద్ అధికారికంగా ప్రకటించారు. మానవ హక్కుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న జగన్నాధరావును ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షునిగా నియమించడంపై కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తలి గౌరీనాయుడు హర్షం వ్యక్తం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని జగన్నాధరావు అన్నారు.

తహశీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి పద్మనాభం : ఉద్యోగోన్నతి పొందిన పద్మనాభం తహశీల్దార్ ఆనందరావును సోమవారం ఘనంగా సత్కరించారు. మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో తహశీల్దార్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కె.రమణ. మాజీ జెడ్పిటిసి కె.దామోదరరావు, చిన్నాపురం మాజీ సర్పంచ్ ఈగల శ్రీరామమూర్తి తదితరులు ఆనందరావును దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అదజేసి అభినందించారు మరిన్ని ఉన్నత ఉద్యోగాలతో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు

బివిఎన్‌లో పక్షుల దినోత్సవం

ప్రజాశక్తి-గాజువాక :జివిఎంసి 70వ వార్డు చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ స్కూల్‌లో ప్రీకెజి చిన్నారులకు పక్షుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల డైరెక్టర్ పొలవలస భాస్కరరావు మాట్లాడుతూ పక్షులు ప్రకృతి సంపద అని, వాటి వల్ల మానవాళికి అనేక ప్రయోజనాలున్నాయన్నారు. ఆహారం, పర్యావరణం పరిరక్షణ, పంటలు మొదలైన వాటితో పాటు ప్రకృతి రమణీయతకు పక్షిజాతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి చిన్నారులు నెమలి, పావురం, చిలుక, కాకి, పాలపిట్ట, బాతు, కోడి, కొంగ, పెంగ్విన్ తదితర రూపాలలో విచ్చేసి వాటికోసం వివరించి, ఆట పాటలతో సందడిచేశారు. ఉత్తమ ప్రదర్శన చేసిన చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందించారు. పాఠశాల ఉపాధ్యాయినులు శైలజ, హేమలత, మణి, జానకి,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు..

బొప్పాయి పంటకు తీవ్ర నష్టం

- ప్రభుత్వ సాయానికి బాధిత రైతుల ఎదురుచూపు



మొంథా దెబ్బకు మజ్జిపేటలో పూర్తిగా ధ్వంసమైన బొప్పాయి పంట

ప్రజాశక్తి -తగరపువలస : మొంథా తుపాన్ ప్రభావానికి భీమునిపట్నం మండలం మజ్జిపేట గ్రామంలో బొప్పాయి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు మజ్జి వెంకటరావు, కోరాడ రమణ అప్పలనాయుడు, కృష్ణ తదితరులు వాపోయారు. అధిక పెట్టుబడులు పెట్టి, ఇంటిల్లిపాది శ్రమించి సాగుచేసిన బొప్పాయి పంట ఆశాజనకంగా ఉందని, ధర కూడా బాగుండడంతో ఈ ఏడాది మంచి దిగుబడులతో అధికలాభాలు వస్తాయని ఎంతో ఆశపడిన నేపథ్యంతో తుపాన్ ప్రభావంతో వీచిన ఈదురుగాలులు, వర్షాలకు తోటలోని చెట్లన్నీ సగానికి విరిగిపోయి, కాయలన్నీ నేలరాలి తీవ్రనష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మజ్జిపేటలో 50 ఎకరాల్లో బొప్పాయి పంట దెబ్బతిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వపరంగా పంట నష్టాలను అంచనా వేసి, తగు పరిహారం చెల్లించడం ద్వారా తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు

విజయవంతంగా ఐఒటి ఎక్స్‌పో

ప్రజాశక్తి- సీతమ్మధార : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం 2025-26 విద్యా సంవత్సరానికి పవర్ సిస్టమ్ జనరేటింగ్ స్టేషన్స్ మోడల్ ఎక్స్‌పో, స్కిల్‌స్కోప్ ఆధారిత ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి) ల్యాబ్ విజయవంతంగా నిర్వహించారు. కళాశాల కార్యదర్శి, సంచాలకులు డాక్టర్ జి మధు కుమార్ ప్రారంభించగా,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి దీపక్ చౌదరి, విభాగాధిపతి డాక్టర్ ఆనంద్ గొందేశి, ఇతర విభాగాధిపతులు డాక్టర్ జిటి.నాయుడు, (సివిల్), డాక్టర్ జె.బాబు (ఇసిఇ), డాక్టర్ డి.మాధవి (సిఎస్ఇ) పాల్గొని విద్యార్థులను అభినందించారు.మోడల్ ఎక్స్‌పోలో బిటెక్ థర్డ్‌ఇయర్ విద్యార్థులు థర్మల్, న్యూక్లియర్, గ్యాస్, హైహెడ్, లోహెడ్ హైడ్రో పవర్‌ప్లాంట్స్, ఎనర్జీ ఆడిట్ వంటి విద్యుదుత్పత్తి స్టేషనుకు సంబంధించిన పనిమోడల్స్‌ను ప్రదర్శించారు. ఇవి విద్యుదుత్పత్తి, ప్రసార విధానాలు, పునరుత్పాదక శక్తి సమన్వయాలను ప్రతిబింబించాయి..అదే సందర్భంలో విభాగం స్కిల్‌స్కోప్, ఐఒటి ల్యాబ్‌ను ప్రారంభించారు. ఫైనలియర్ బిటెక్ విద్యార్థులు ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్, స్మార్ట్ కార్, .జిపిఎస్ ట్రాకింగ్, ఎర్త్‌క్వేక్ డిటెక్టర్, స్మార్ట్ ఎనర్జీ మీటర్, స్మార్ట్ బ్లైండ్ గైడెన్స్, హెరీమ్ ఆటోమేషన్, రాడార్ సెన్సింగ్ సిస్టమ్ వంటి ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రధాన అతిథి డా. మధు కుమార్ ఐఒటి పునరుత్పాదక శక్తి స్మార్ట్ గ్రిడ్లు, భవిష్యత్ విద్యుత్ రంగానికి అత్యంత కీలకమన్నారు.



ప్రదర్శన తిలకిస్తున్న డాక్టర్ మధుకుమార్

ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మళ్ల

ప్రజాశక్తి- ములగాడ : మొంథా తుపాన్ ప్రభావిత పశ్చిమ నియోజకవర్గం 40వ వార్డు ఎకెసి కాలనీ, రాజీవ్ కాలనీల్లోమాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ పర్యటించారు ముంపు బాధితులతో మాట్లాడారు ముంపునకు కారణమైన మెయిన్‌రోడ్డులో కల్వర్టు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బాధితులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో . కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు వైసిపి నాయకులు మిశ్రా, శ్యామ్, సూరి, కిషోర్, ప్రకాష్, మోహన్, సందీప్, సురేష్, గణేష్, వేణు, కృష్ణ, సూరిబాబు, శ్రీను, రామునాయుడు, శివ, ధర్మ, మురళి, కె.రమేష్, జె. రమేష్, శ్యామ్ బెహరా పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - ఆనందపురం: స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సోమవారం భీమిలి నియోజకవర్గ పరిధిలో రాజ్యాంగ దినోత్సవాన్ని, విద్యార్థి అసెంబ్లీ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థి శాసనసభ్యుల ఎంపికను నిర్వహించారు. ఆనందపురం ఎంఇఒ ఆధ్వర్యంలో ఆనందపురం, పద్మనాభం, భీమిలి, చినగదిలి మండలాల విద్యాశాఖాధికారులు సమన్వయంతో నియోజకవర్గ స్థాయిలో ఎంపికల కోసం విద్యార్థుల మధ్య పోటీలు నిర్వహించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారిని అభినందించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్నికైన విద్యార్థి శాసనసభ్యులతో ఉపాధ్యాయులు

అయ్యప్పదీక్షాపరులకు అన్నదానం

ప్రజాశక్తి-పద్మనాభం. మండలంలోని మద్ది గ్రామపంచాయతీలోని ధర్మశాస్త్ర సేవాపీఠంలో నిత్యాన్నదానంలో సోమవారం భీమిలి మండలం దాకమర్రి గ్రామానికి చెందిన ఆవనాపు బుజ్జి కుటుంబీకులు అయ్యప్పదీక్షాపరులకు అన్నదానం చేశారు. స్వాములు సద్వినియోగ చేసుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

డ్రగ్స్ కేసులో ముగ్గురు అరెస్ట్
- 48 ఎల్ఎస్‌డి బ్లాట్స్ స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం రైల్వే స్టేషన్లో ఆదివారం సాయంత్రం కలకలం సృష్టించిన డ్రగ్స్ అక్రమ రవాణా కేసుకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేసినట్లు విశాఖపట్నం లా అండ్ ఆర్డర్ డిసిపి మేరీ ప్రశాంతి తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. అరెస్టయిన వారిలో వైసిపి యువ విద్యార్థి అధ్యక్షుడు పులగం కొండారెడ్డి (23), బిటెక్ విద్యార్థులు మురాడ గీత్ చరణ్ (21), తంగి హర్షవర్ధన నాయుడు (22) ఉన్నారని పేర్కొన్నారు. డ్రగ్స్‌ను విక్రయించిన సంథన్ పరారీలో ఉన్నాడని, నిందితులను జ్యుడీషియల్ రిమాండ్ కోసం కోర్టులో హాజరు పరుస్తున్నామని తెలిపారు. వారి నుండి 48 ఎల్ఎస్‌డి బ్లాట్స్, ఒలా ఎలక్ట్రిక్ స్కూటీతో పాటు మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో ఈస్ట్ ఎసిపి లక్ష్మణమూర్తి, ఇన్‌స్పెక్టర్లు కల్యాణ్, భాస్కరరావు, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బాట జంగాల పాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ అనిల్ కుమార్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు బాట జంగాలపాలెంలోని సుంకర జితేంద్ర షాప్‌పై తమ సిబ్బంది దాడి చేసి 18 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు జితేంద్రపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా, 14 రోజులు రిమాండ్ విధిస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అరెస్ట్

అనకాపల్లి రూరల్ : అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ రవి కుమార్ తెలిపారు. మాకారం గ్రామ శివారులో అక్రమంగా మద్యాన్ని కలిగి ఉన్న తర్రా అప్పలరాజును అరెస్ట్ చేశామన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రజాసమస్యలను తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం చొరవ చూపాలని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సూచించారు. సోమవారం ఐదో జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో పాల్గొని, ప్రజల సమస్యలను తెలుసుకుని, స్వయంగా వారి నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి, సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు.

కాగా ఐదోజోనల్ కార్యాలయంలో పిజిఆర్ఎస్‌లో 13 అర్జీలు వచ్చాయని జోనల్ కమిషనర్ బి.రాము తెలిపారు.కార్యక్రమంలో ఇఇ పద్మావతి, రెవిన్యూ ఆఫీసర్ బాబూరావు, టౌన్ ప్లానింగ్ ఎసిపి తిరుపతి రావు , ఎపిడి పుణ్యవతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్,వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సునీత

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు శ్రీకృష్ణాపురం మండల పరిషత్ పాఠశాలకు చెందిన 40మంది విద్యార్థులకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను సోమవారం వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ అందజేసారు. కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయులు ముత్యాలరావు, టిడిపి వార్డు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, నాయకులు జక్కన్న, శ్రీను, రమణమూర్తి, స్కూలు కమిటీ చైర్మన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏడు నెలల వేతన బకాయి చెల్లించాలని
సినర్జీస్ కార్మికుల నిరసన



ఆందోళనలో పాల్గొని సంఘీభావం చెబుతున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఏడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని దువ్వాడలోని సినర్జీస్ క్యాస్టింగ్ లిమిటెడ్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు సోమవారం నిరసన చేసట్టారు. సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనలో పలువురు కార్మిక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి నెలా ఆందోళన చేస్తే తప్ప, సినర్జీస్ యాజమాన్యం ఉద్యోగుల జీతాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. సినర్జీస్ ఉద్యోగుల ఆందోళనకు వైసిపి గాజువాక నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్, సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు చేగొండి శ్రీనివాసరావు, పల్లా చిన్నతల్లి, భూపతిరాజు శ్రీనివాసరాజు, శ్రీనివాస్ పట్నాయక్, పత్తిపాటి శ్రీనివాసు, మాటూరి శ్రీనివాసరావు, హరీష్ వర్మ, వెంకటరావు, జివి.రమణారెడ్డి, సినర్జీస్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి దాసు, జగన్, దేవర సత్తిబాబు, యువి. అప్పారావు పాల్గొన్నారు.

వార్డు కమిటీలతో పార్టీ బలోపేతం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : వార్డు కమిటీల ఏర్పాటుతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు కోరారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పార్టీనేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, తుళ్ళి చంద్రశేఖర్, హనుమంతు, రామారావు, పాత్రుడు, బాలాజీ, జయ, సంపత్, చిన్న, ఉస్మాన్‌భాషా, నూర్ మహ్మద్, రాజారావు, కనకరాజు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలకు నిత్యావసరాలు



నిత్యావసర సరుకులు అందజేస్తున్న టిడిపి నాయకులు)

ప్రజాశక్తి - ఆరిలోవ : మొంథా తుఫాన్ ప్రభావంతో వేటకు వెళ్ళకుండా ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులను అందజేసారు. 12వ వార్డు నెహ్రూనగర్‌లోని 221 రేషన్ డిపో ద్వారా ఒక్కొక్క కుటుంబానికి 50 కేజీల బియ్యం, కిలో చొప్పున కందిపప్పు, పంచదార,ఉల్లిపాయలు, బంగాళా దుంపలు, ఒక లీటర్ పామాయిల్, అందజేసారు.కార్యక్రమంలో వార్డు టిడిపి ఇన్‌చార్జ్ ఒమ్మి అప్పలరాజు, అధ్యక్షులు గాడి సత్యం, విశాఖ పార్లమెంటు కమిటీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి పోతిన భరత్, ఉపాధ్యక్షులు కొత్తల గోపాల్, రేపాక బసవ దేవుళ్ళు, రాగోలు తిమోతి, బండారు శంకరరావు, ఇల్లా లక్ష్మీ, రాగోలు షారోనిపాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించి, విస్తరించండి


- పెదగంట్యాడ, గంగవరం రోడ్డు దుస్థితిపై సిపిఎం ఆధ్వర్యాన ధర్నా



పెదగంట్యాడలో ఆందోళన చేస్తున్న సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడ నుంచి గంగవరం గ్రామానికి వెళ్లే రహదారిని వంద అడుగుల రోడ్డుగా విస్తరణ చేయాలని సిపిఎం స్టీల్ డివిజన్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ జనరల్ హాస్పిటల్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం స్టీల్ డివిజన్ నాయకులు యు.సోమేష్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా ఈ రోడ్డంతా గుంతలమయమై అధ్వానంగా మారడంతో వాహన రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు అదే సమయంలో శ్రావణ్ షిప్పింగ్ లారీలు ఇటుగా వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. శ్రావణ్ షిపింగ్ లారీల రాకపోకలను నియంత్రించాలని కోరారు. సిపిఎం గంగవరం నాయకుడు కె.మహేష్ మాట్లాడుతూ గంట్యాడ, గంగవరం రోడ్డును వంద అడుగులకు విస్తరించడాఇనకి స్థానిక తహశీల్దార్, జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సర్వేలు చేయగా, అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం, శ్రావణ్ షిప్పింగ్ కంపెనీ చెరో 40అడుగులకు ఆక్రమించినట్లు స్పష్టమైందన్నారు. దీనిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. గంగవరం గ్రామ పెద్ద కె.రాజు, సిపిఎం నాయకులు కోవిరి అప్పలరాజు మాట్లాడుతూ, ప్రజల రాకపోకలకు నిర్దేశించిన రోడ్డులో, శ్రావణ్ షిప్పింగ్ కంపెనీకి చెందిన భారీ లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు పాడవ్వడంతోపాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు నాయకులు నమ్మి రమణ, గంగవరం ఏరియా నాయకులు వై. అప్పలరాజు, వై. శ్యామ్, కె.సూకరాజు, కె.రాజేష్, మహాలక్ష్మిరెడ్డి, పి.ధనరాజు, పి.అప్పలరాజు, వై.సాయి, పి. కోదండరావు, శామ్యూల్, రాజు, బాలు పాల్గొన్నారు.

న్యాయవాది హరనాథ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న జగ్గునాయుడు, తదితరులు

ప్రజాశక్తి-మాధవధార : న్యాయవాది ఎన్ హరనాథ్ సంస్కరణ సభ సోమవారం కంచరపాలెం కాయితి పైడయ్య కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎన్ హరనాథ్ చిత్రపటానికి సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐలో చురుగ్గా పనిచేసిన హరనాథ్, కంచరపాలెం ప్రాంతంలో స్థానిక సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించాన్నారు. కంచరపాలెం లీగల్ సెల్‌కు న్యాయపరమైన సలహాలు అందించాన్నారు. పేదలు మధ్యతరగతి ప్రజలకు ఉచిత న్యాయ సలహాలతోపాటు అనేక కేసులను ఉచితంగానే వాదించారన్నారు. కంచరపాలెం ప్రాంతంలో విఆర్ చిట్స్ బాధితులకు లీగల్‌గా అండగా ఉన్నారన్నారు అనేక కుటుంబ కలహాల కేసులకు సలహాలు, సూచనలు అందించి వాటి పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, విశాఖ జిల్లా మహిళా నాయకురాలు బి పద్మ, ఎం సుజాత, విశాఖ జిల్లా సిఐటియు నాయకులు ఆర్‌కెవిఎస్ కుమార్, జి.సూర్యచంద్రరావు, ఎస్ రామ్‌గోపాలరావు, పి రామచంద్రరావు, కె.సత్య నారాయణ, కమలమ్మ, నానాజీ హరనాథ్ స్నేహితులు అభిమానులు పాల్గొని నివాళులర్పించారు.

పిజి రేడియాలజిస్ట్‌లకు స్వర్ణ పతకాలు

- పరిశోధనల్లో సత్తా చాటిన ఆంధ్ర వైద్యకళాశాల విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్, సూపరింటెండెంట్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :గీతం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రేడియాలజిస్టుల రాష్ట్రసదస్సులో ఆంధ్ర వైద్యకళాశాల పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ప్రతిభ చూపాలరు. రాష్ట్ర స్థాయిలో 180 పరిశోధన పత్రాల సమర్పణకు అనుమతి లభించగా, వాటిలో ఎఎంసి పోస్టుగ్రాడ్యుయేట్ డాక్టర్ జి.పుష్పిత, ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిష్టాత్మక వైజాగ్ సిటీ సబ్‌చాప్టర్ అవార్డు బంగారు పతకాన్ని దక్కించుకున్నారు. 150 పరిశోధన పత్రాలు సమర్పించగా, డాక్టర్ జయగురు సంబతరాజన్ పరిశోధనకు ద్వితీయ బహుమతిగా డాక్టర్ రాజారెడ్డి బంగారు పతకం, డాక్టర్ మేఘన అడిగ ప్రత్యేక ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. అవార్డులు అందుకున్న విద్యార్థులకు ఆంధ్ర వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యా దేవి, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జి బాబు, రేడియాలజీ ఆచార్యులు డాక్టర్ ఉమా మహేశ్వర రావు,

సమస్యలపై జెడ్‌సికి వినతి

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి మూడోవార్డు పరిధిలో సమస్యలను పరిష్కరించాలని వైసిపి వార్డు అధ్యక్షులు అల్లిపిల్లి నరసింగరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు జెడ్‌సి ఒమ్మి అయ్యప్ప నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఎగువపేట, బోయివీధి, గొల్లవీధి,తోటవీధి, పెద్ద బజారు, చిన్న బజారు, కృష్ణా కాలనీ తదితర ప్రాంతాల్లో ఇటీవల తుఫాను కారణంగా తాగునీటి సమస్య తలెత్తిందని, ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా సరిపడా నీటిని సరఫరా చేయాలని కోరారు. వీధి దీపాలు వెలగడంలేదని, కాలువల్లో పేరుకుపోయిన చెత్త, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని, ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైసిపి మూడోవార్డు ప్రధాన కార్యదర్శి వి కొండబాబు, పార్టీ నాయకులు ఆర్ ప్రభాకర్‌నాయుడు, సిహెచ్ గౌరినాయుడు, పాసి వినోద్ కుమార్ పాల్గొన్నారు

జనావాసాల మధ్య అదాని సిమెంట్
అనుమతులు రద్దు చేయాలి



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న అసోసియేషన్ల ప్రతినిధులు

ప్రజాశక్తి -గాజువాక : కాలుష్య కారకమైన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని జనావాసాల మధ్య ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని గాజువాక వార్వా నివాస్ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం అదానీ గంగవరం పోర్టు రోడ్డు వద్ద వార్వా, నివాస్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, వాయిస్ ఆఫ్ గాజువాక ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ, సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే కాలుష్యంతో భూగర్భజలాలు, భూఉపరితల కాలుష్యంతో కేన్సర్, గుండె, కిడ్నీ సంబంధిత ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గంగవరం పోర్టు కాలుష్యంతోపాటు డంపింగ్‌యార్డుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇపుడు సిమెంట్ ఫ్యాక్టరీని నెత్తినపెట్టి ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. ఐక్యంగా పోరాడి సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును అడ్డుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్వా, నివాస్ గాజువాక అధ్యక్షులు త్రినాధస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు బి గుర్రప్ప, తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ ఉపాధ్యక్షులు ఎం వెంకటేశ్వరరావు, సెక్రెటరీ శ్రీనివాస్ చౌదరి, జన విజ్ఞాన వేదిక గాజువాక ప్రధాన కార్యదర్శి పాలూరు లక్ష్మణ స్వామి, వాయిస్ ఆఫ్ గాజువాక అధ్యక్షులు చిక్కా సత్యనారాయణ, పోరాట కమిటీ కన్వీనర్, నోవాస్ అపార్ట్మెంట్ వాసులు జోత్స్న, వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు పాల వెంకయ్య, శ్రీకాంత్, నమ్మి రమణ, డి వెంకట్రావు, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి



ఎమ్మెల్యే పల్లాకు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి -గాజువాక : సొంతంగా ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు, అసోసియేషన్ భవన నిర్మాణానికి ప్రభుత్వపరంగా స్థలం కేటాయించాలని ఎపి టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. సోమవారం టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇరవై ఏళ్లుగా గాజువాక ఆటోనగర్‌లో టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్లంతా అసోసియేషన్ ఏర్పడి, ఎందరికో వెల్డర్, ఎలక్ట్రీషియన్లుగా సాంకేతిక శిక్షణనిచ్చి విదేశాలకు పంపించామని, వారంతా ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారన్నారు. అయితే తమ ఇనిస్టిట్యూట్, వర్క్‌షాప్‌తోపాటు అసోసియేషన్‌కు సొంత భవనం లేక, అద్దింట్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో తమకు సొంత స్థలం కేటాయింపుతోపాటు ఇనిస్టిట్యూట్‌లో ఎక్విప్‌మెంట్ కొనుగోలుకు రాయితీ ఇవ్వాలని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను ఇస్తూ, వాటికి గుర్తింపునివ్వాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే పల్లా సానుకూలంగా స్పందించారు. అసోసియేషన్ అధ్యక్షులు కరణం కనకా రావు, ప్రధాన కార్యదర్శి చట్టి వెంకటరమణ, నాయకులు బొండా అచ్చిబాబు, నందర్పు రమణ, పరదేశి పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు ఐదు అర్జీలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు ఐదు అర్జీలు అందినట్లు జెడ్‌సి ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి మూడు, ప్రజారోగ్య విభాగానికి రెండు వినతులు రాగా, తగు చర్యలకు ఆయా విభాగాల అధికారులకు నివేదించామన్నారు.

అనకాపల్లి పుస్తక మహోత్సవానికి క్యూ



కవి సమ్మేళనంలో పాల్గొన్న అనకాపల్లి సాహితీ మిత్రులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎన్‌టిఆర్ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న 1వ అనకాపల్లి పుస్తక మహోత్సవానికి స్థానిక పాఠశాలల విద్యార్థులు, పుస్తక ప్రియులు క్యూ కడుతున్నారు. సైన్స్, జీకే, మ్యాథ్స్ వంటి విభాగాలు, పలు రకాల పుస్తకాలను కొనుగోలు చేసి, ఈ మహోత్సవం పట్ల తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణరావు పుస్తక మహోత్సవాన్ని సందర్శించి, 'గురజాడలు' పుస్తకం గురించి తన అనుభవాలను పంచుకున్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

అనకాపల్లి 1వ పుస్తక మహోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన కవి సమ్మేళనం ఆద్యంతం ఆకట్టుకుంది. అనకాపల్లి సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సాహితీ మిత్రుల సంస్థ అధ్యక్షులు జి రంగబాబు, ప్రధాన కార్యదర్శి కోరాడ అప్పలరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు కవులు సామాజిక స్పృహ కలిగిన చక్కని కవితలను చదివి వినిపించారు. పుస్తక ఔన్నత్యాన్ని తెలుపుతూ తమ కవితలతో అందరినీ అలరించారు. కవిత్వ లక్షణాలు సామాజిక అభ్యుదయాన్ని పెంపొందించేలా ఉండాలన్నారు. కనుమరుగైన పద్యం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నిర్వాహకులు కవులను పుస్తకాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి సాహితీ మిత్రులు చక్రపాణి, సనారా, సాయిబాబు, కాళిదాసు, అమర జ్యోతి, మల్లీశ్వరి, స్వాతీ కృష్ణ సన్నిధి, శాస్త్రి, బుద్ధ వీరు నాయుడు, రామ్మోహన్ మాస్టారు, బల్ల నాగభూషణం, బద్రి కుమార్ రాజా, గగనం శ్రీను కుమార్, శ్రీదేవి, ఉప్పాడ రాము, సుభాషిణి, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




చిత్ర లేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

పుస్తక మహోత్సవంలో భాగంగా బాలోత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు 'మీకు నచ్చిన సైన్స్ ఆవిష్కరణ" అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా జరిగిన ఈ పోటీల్లో స్థానిక జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల, జీవీఎంసీ బాలికల ఉన్నత పాఠశాల, జీవీఎంసీ గాంధీ నగరం ఉన్నత పాఠశాల, డిఏవి, విశ్వశాంతి, సిటీ పబ్లిక్ స్కూల్ తదితర పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు పుస్తక మహోత్సవం ఆఖరి రోజు బహుమతులు అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

మంగళవారం ముఖ్య కార్యక్రమాలు

- సాయంత్రం 5 గంటలకు రామ్మోహన్‌రావు అధ్యక్షతన "తెలుగు భాషా విశిష్టత"పై సదస్సు జరుగుతుంది.
- సాయంత్రం 5.45 గంటలకు ఎపి అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పుస్తక మహోత్సవానికి విచ్చేసి, స్టాల్స్ సందర్శిస్తారు. అనంతరం "గ్రంథాలయాలు -సమాజం" అనే అంశంపై ఉపన్యాసం ఇస్తారు.
- రాత్రి 7 గంటలకు అనకాపల్లి లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వినకోట బుచ్చిరాజు బృందం ఆధ్వర్యంలో నవ్వుల పువ్వులు వెదజల్లే హాస్యరసాల స్కిట్స్ ప్రదర్శన ఉంటుంది. వీటిని జయప్రదం చేయాలని బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె.లక్ష్మయ్య కోరారు.



వర్తక సంఘం అధ్యక్షులుకు పుస్తకం అందిస్తున్న లక్ష్మయ్య

హోం మంత్రి అనితకు ఆహ్వానం

నక్కపల్లి : అనకాపల్లిలో పుస్తక మహోత్సవానికి రావాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితకు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధులు ఆహ్వానం పలికారు. నక్కపల్లి మంత్రి కార్యాలయం వద్ద సోమవారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి మంత్రి అనితను ఆహ్వానించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు కె.లక్ష్మయ్య మాట్లాడుతూ, గత 35 ఏళ్లుగా పుస్తకోత్సవాలను నిర్వహిస్తూ, పుస్తక పఠన సంస్కృతిని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తోందని వివరించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ పుస్తక మహోత్సవాన్ని అనకాపల్లిలో నిర్వహించడం పట్ల మంత్రి అభినందనలు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర హోం మంత్రి అనిత



రాత్రి సమయంలో గ్రావెల్ తవ్వకాలు చేస్తున్న దృశ్యం

పంచదార్లలో జోరుగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని పంచదార్ల పంచాయతీ పరిధిలోని పంచదార్ల కొండను గత రెండు రోజులుగా రాత్రి సమయంలో జోరుగా తవ్వేస్తున్నారు. అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులకు తెలియజేసినప్పటికీ వారు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అర్ధరాత్రి సమయంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నా దుండగులపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని సిపిఎం మండల కార్యదర్శి జి.దేవుడునాయుడు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని దేవుడునాయుడు డిమాండ్ చేశారు.

బయో కెమికల్స్‌తో ఆరోగ్యకరమైన పంటలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రసాయన రహిత బయో కెమికల్స్‌తో ఆరోగ్యకరమైన పంటలు ఉత్పత్తి చేయవచ్చని వెలుగు ఏపిఎం కొండమ్మ అన్నారు. మండలంలోని సీతానగరం గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం వనరుల కేంద్రం ప్రారంభించారు. బయో కెమికల్స్ ఈ షాపులో అన్ని రకాల ప్రకృతి వ్యవసాయ సంబంధించిన రసాయనాలు, కషాయాలు లవణాలు, బయో కల్చర్ తెలుపు జిగురు అట్టలు, అన్ని రకాల ఉత్పత్తులు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు సత్యనారాయణ, దేవానంద్, ఎపిఓ సీసీ కృష్ణారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల ఇంచార్జ్ మజ్జి సత్యారావు, రమేష్ కూటమి నాయకులు బొబ్బరి రమణ, వియ్యపు వీరబాబు, ప్రకాష్ రావు,గంగు పాము తాతారావు, వియ్యపు లక్ష్మి, గ్రామ సంఘం ఓపి లక్ష్మి, వివోఏ రజని తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారుగా ఆనందరావు బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి తహశీల్దార్‌గా గారా ఆనందరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అల్లూరి జిల్లా చింతపల్లిలో తహశీల్దార్‌గా పనిచేసిన ఆనందరావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. అనకాపల్లిలో కొంతకాలం నుంచి పూర్తి స్థాయిలో తహశీల్దార్ లేరు. ఆనందరావును పలువురు అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పౌర సేవలను పారదర్శకంగా అందించేందుకు సిబ్బందిని సమన్వయం చేసుకొని పనిచేస్తానని చెప్పారు.

పేదల ఆరోగ్యానికి పెద్ద పీట

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తుందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 14 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ.13,91,577, జనసేన పార్టీ ప్రమాద బీమా నుండి ఇద్దరికి రూ.10 లక్షలు చెక్కులను సోమవారం రాంకీ వారి ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలను ఆదుకోవడం కోసమే సీఎం సహాయ నిధి అని తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న జనసేన నేత రాంకీ

పోలీసు ఓపెన్ హౌస్ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : పోలీసు అమరవీరులు విధి నిర్వహణలో చూపిన త్యాగాలకు నివాళులర్పిస్తూ, అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు సమాజ రక్షణలో, శాంతి భద్రతల పరిరక్షణలో తమ ప్రాణాలను ధారపోసిన మహానుభావులని తెలిపారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ, విద్యార్థులకు పోలీసులు విధులు నిర్వర్తించే క్రమంలో ఉపయోగించే అత్యాధునిక ఆయుధాలు, పరికరాల గురించి అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని చెప్పారు. ఏకె-47, పిస్టల్ గ్లోక్-17, కార్బన్, ఇన్సాస్ రైఫిల్, మల్టీ గ్యాస్ గన్ లాంచర్, గ్రెనేడ్ తదితరాలు భద్రతా పరికరాలు, రైట్ గేర్ సెట్స్, బాంబ్ డిఫ్యూజల్ పరికరాలు, నైట్ విజన్, సెర్చ్ మెటల్ డిటెక్టర్లు, కమ్యూనికేషన్ పరికరాలైన శాటిలైట్ ఫోన్, స్కానర్, విహెచ్‌ఎఫ్ సెట్స్, రోబో సూట్, డాగ్ స్క్వాడ్‌కు చెందిన బన్నీ (మత్తు పదార్థ గుర్తింపు), రియో (ట్రాకింగ్), లక్కీ (మందు పాతర గుర్తింపు), ఫింగర్ ప్రింట్, క్లూస్ టీం నేరస్తుల పరిశోధనలో సాక్ష్యాధారాల సేకరణ పద్ధతులు తదితర వాటిని విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించారు. పోలీసు విభాగం పనితీరుపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన్‌రావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, రమేష్, గఫూర్, రామకృష్ణారావు, మన్మధరావు, అశోక్ కుమార్, విజయ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు పోలీసు సేవలపై తెలియజేస్తున్న ఎస్పి తుహిన్ సిన్హా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన కూండ్రం హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపి అంతర జిల్లాల సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే అనకాపల్లి జిల్లా క్రీడాకారుల ఎంపిక తుమ్మపాల క్రీడా ప్రాంగణంలో సోమవారం జరిగింది. అనకాపల్లి మండలం కూండ్రం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలో వి.వర్షిత (8వ తరగతి) ఎస్.చాందిని (10వ తరగతి) ఎం. దివ్య ప్రహర్షిని (10వ తరగతి) బి.లోకేష్ కళ్యాణ్ (10వ తరగతి) ఎంపికయ్యారు. క్రీడాకారులకు, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.ఆదిలక్ష్మికి విద్యా కమిటీ చైర్మన్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కశింకోట : అనకాపల్లి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తుమ్మపాల క్రీడామైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక పోటీల్లో జిల్లా జట్టుకు మండలంలోని వెదురుపర్తి స్కూల్‌కు చెందిన కె.కుందన, ఎన్.పూజిత ఎంపికయ్యారు. ఈ నెల 7, 8, 9 తేదీలలో కర్నూలు జిల్లాలో జరుగు రాష్ట్ర పోటీల్లో వీరు అనకాపల్లి జిల్లా తరుపున పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల హెచ్‌ఎం నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎ.నూకరాజు అభినందించారు.

బుచ్చయ్యపేట : ఎపి అంతర్ జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు మండలంలోని రాజాం జెడ్‌పి హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి నమ్మి నాయుడు ఎంపికయ్యాడు. నాయుడును హెచ్‌ఎం డి.అప్పారావు, పీడీ అప్పలనాయుడు ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన వెదురుపర్తి హైస్కూల్ విద్యార్థినులు



నాయుడును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పోలేపల్లి సర్వేనెంబర్ 156లోని ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. ఈ భూముల్లో ఆక్రమణదారులు వేసిన యూకలిప్టస్ మొక్కలను పూర్తిగా తీసివేశారు. ఈ సందర్భంగా మండల తహసిల్దార్ లక్ష్మీ మాట్లాడుతూ సుమారు పది ఎకరాలకు పైగా భూముల్లో వేసిన మొక్కలను పూర్తిగా తొలగించామని తెలిపారు. ఆక్రమిత స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో తరుణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సహకార, డ్వాక్రా సంఘాలు బలోపేతం కావాలి

ప్రజాశక్తి-కోటవురట్ల : సహకార సంఘాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో డ్వాక్రా సంఘాలు బలోపేతం కావాలని డిసిసిబి చైర్మన్ కోన తాతారావు అన్నారు. మండల కేంద్రంలోని డిసిసిబి బ్యాంక్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎరువులు పంపిణీ, వ్యవసాయ పనిముట్లను సబ్సిడీతో అందజేస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు తక్కువ వడ్డీతో రుణాలు అందజేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అనంతరం పలు డ్వాక్రా సంఘాలకు తాతారావు చేతులమీదుగా రుణాలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి కాశి నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు జనార్ధన్, జనసేన మండల అధ్యక్షులు శ్రీనివాస్, నియోజకవర్గం ఇన్‌ఛార్జి సూర్యచంద్రరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ఘోర రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండల కేంద్రం ఎస్.రాయవరం గ్రామం వద్ద సైడు కాలువలోకి బ్రాండిక్స్ కంపెనీ బస్సు దూసుకెళ్లిన సంఘనలో తృటిలో ఘోర రోడ్డు ప్రమాదం తప్పింది. సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో యస్ రాయవరం నుండి పి.ధర్మవరం వెళ్లున్న బ్రాండిక్స్ బస్సు అదుపుతప్పి సైడు కాలువలోకి దూసుకెళ్ళింది. ఆ సమయంలో బస్సులో మహిళా కార్మికులు లేకపోవడంతో ఘోర ప్రమాదం తప్పింది. వమ్మవరం నుండి మహిళా కార్మికులను బ్రాండిక్స్ కంపెనీకి తీసుకెళ్లేందుకు వస్తున్నప్పుడు ఈ ఘటన జరిగింది. స్థానికులు వెంటనే స్పందించడంతో ప్రమాదం నుండి స్వల్ప గాయాలతో డ్రైవర్ బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న యస్ రాయవరం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

ఎస్‌సి కాలనీలో మురుగు తొలగించాలి

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని కుమారపురం పంచాయతీ ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు మార్గంలో మురుగు తొలగించాలని ఆ గ్రామానికి చెందిన నీలాపు వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మురుగునీరు నిలిచిపోయి కల్వర్టు పూర్తిగా మూసిపోయిందని, వర్షం వచ్చినప్పుడు గ్రామంలో నీరు బయటికి పోయే మార్గం పూడికపోయిందని పేర్కొన్నారు. దీంతో ప్రజలు, స్కూలు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాను ప్రభావిత గ్రామాలను శుభ్రం చేయాలని ఉన్నతాధికారులు సూచనలు ఇచ్చినా కుమారపురం పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే సంబంధిత అధికారులు తగు చర్య చేపట్టాలని వెంకటరెడ్డి కోరారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఆర్‌వై అగ్రహారం గ్రామంలో గౌరీ పరమేశ్వరుల అనుప మహోత్సవాన్ని ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాగుల చవితి రోజున గౌరీ పరమేశ్వరులను ప్రతిష్టించారు. గ్రామస్తులు అప్పటి నుంచి రోజు తప్పించి రోజు గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం రాత్రి డబ్బులు, మేళ తాళాలు, వాయిద్యాలు, తప్పిడి గుళ్ళు, సారే, భారీ మందు గుండుతో గౌరీ పరమేశ్వరులను నిమజ్జనం చేశారు.

సాంబమూర్తి సూలాల మహోత్సవం

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక సాంబమూర్తి స్వామి ఆలయం వద్ద సోమవారం సులాల మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం సాయికృష్ణను ఆలయ కమిటీ వారు ఘనంగా సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు, కూటమి నాయకులు దాడి శివ, బిల స్రవంతి, సూరిశెట్టి అప్పలనాయుడు, సూరిశెట్టి దుర్గ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



టిడిపి నేత సాయికృష్ణకు చిత్ర పటాన్ని అందిస్తున్న దృశ్యం

ఇంటి పన్నుల అక్రమ వసూళ్లపై విచారణ చేపట్టాలి

పిజిఆర్ఎస్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకన్న ఫిర్యాదు



వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేత వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి పంచాయితీలో ఇంటి పన్నులు వసూళ్లలో జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్రమైన దర్యాప్తు జరిపించి అవినీతికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న, ఎంపిడివో కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మునగపాక నుంచి దేవరాపల్లికి బదిలీపై వచ్చిన బిల్ కలెక్టర్ దేవరాపల్లి గ్రామ ప్రజల కష్టాన్ని అధికార పార్టీ నాయకుల అండ దండలతో ఇంటి పన్నులు రూపంలో వసూళ్ళు చేసిన సొమ్మును ప్రభుత్వానికి చెల్లించకుండా స్వాహా చేసారని మండిపడ్డారు. ఇందులో ఇతర సిబ్బంది హస్తం ఉన్నట్లుగా స్పష్టంగా అర్థమౌతుందన్నారు. విషయంపై పత్రికల్లో వార్తలు వచ్చినా అధికార పార్టీ నాయకుల అండ దండలు ఉండడంతో ఈ బాగోతంపై ఎటువంటి విచారణ జరపలేదని విమర్శించారు. దేవరాపల్లి పంచాయతీలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.13 లక్షలు మేర ఇంటి పన్ను వసూళ్ళు కావాల్సి ఉండగా గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది మే 25వ తేదీ వరకు రూ.6 లక్షలు మాత్రమే బ్యాంక్‌లో జమ చేశారని, మిగిలిన సొమ్ములో ఎంత మేరకు వసూలు అయిందో సమగ్రమైన దర్యాప్తు జరిపితే తప్ప పూర్తి స్థాయిలో స్పష్టత రాదని పేర్కొన్నారు. గతంలో బాత్ రూములు కుంభకోణంలో పంచాయతీ ఇఓ సస్పెండ్ అయ్యారని, ఇలా ఎంతో మంది అధికార పార్టీ నాయకులు చేతుల్లో అధికారులు బలై పోతున్నారనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పంచాయతీలో పన్నుల వసూళ్లలో అవినీతి ఆరోపణలతో సమగ్రంగా దర్యాప్తు చేపట్టాలని కోరారు.

పిజిఆర్ఎస్‌కు 292 అర్జీలు

ఫిర్యాదుల సమాచారం కోసం 1100 కాల్ చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారుల సమస్యలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి వారు సంతృప్తి చెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఇంచార్జి డిఆర్వో ఎస్‌విఎస్ సుబ్బులక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తం 292 అర్జీలు ప్రజల నుండి వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. అనంతరం పరిష్కారం కాని అర్జీలపై సమీక్ష నిర్వహించారు. పరిష్కారం కాని అర్జీలకు కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. అర్జీదారులు తమ అర్జీల సమాచారం కోసం 1100 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిపిఒ సందీప్, డ్వామా పీడీ పూర్ణిమ దేవి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, డిఎంహెచ్ఒ హైమావతి, జిల్లా సర్వే భూ రికార్డుల సహాయ సంచాలకులు గోపాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో 82 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మొత్తం 82 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 7 రోజుల లోపు విచారణ పూర్తిచేసి తగిన పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్సై వెంకన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధికారులు పక్షపాత వైఖరి వీడాలి

ప్రజాశక్తి-సబ్బవరం : అధికారులు పక్షపాత వైఖరి వీడాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక ఎంపిడిఒ, తహశీల్దారు కార్యాలయాల్లోనూ, పోలీస్ స్టేషన్‌లోనూ పిజిఆర్ఎస్‌లో టిడిపి కార్యకర్తలతో వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అయినా టిడిపి నాయకులు, కార్యకర్తల సమస్యలను అధికారులు పరిష్కారం చేయలేదని తెలిపారు. రెవెన్యూ అధికారులు టిడిపి వారి సమస్యలను పరిష్కరించకుండా పక్షపాత వైఖరితో ఒకే వర్గానికి పనిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారం రోజుల్లో సమస్యను పరిష్కరించాలని, లేకుంటే తాము చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అభివృద్ధి నిధులు ఏ ఊరికి ఎంత వచ్చాయి? ఏ పనికి ఎంత వచ్చిందనే వివరాలను టిడిపి నాయకులకు పంచాయతీ కార్యదర్శులు తెలపలేదని ఎంపీడీవో పి.పద్మజను నిలదీశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గండి ముత్యాల నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ గండి దేముడు బాబు, శాప్ డైరెక్టర్ పిబివిఎస్ఎన్ రాజు, గండి వంశీ దీప్, కోటాన అప్పారావు, కోరాడ శ్రీనివాసరావు, పల్లా తాతారావు, రేసుపూడి రమణ, గొర్లి చైతన్య, ఆడారి నాగరాజు, దాడి కన్నం నాయుడు, ఆకుల గణేష్, ఎం అక్కుబాబు పాల్గొన్నారు.

కెజిబివిలో స్కిల్ కాంపిటేషన్

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బేతపూడి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో సోమవారం విద్యార్థినులకు స్కిల్ కాంపిటేషన్ నిర్వహించారు. బ్యూటీ అండ్ వెల్నెస్ ట్రేడ్‌లో శిక్షణ పొందుతున్న బాలికలు తమ మెలకువలను ప్రదర్శించి పోటీల్లో పాల్గొన్నారు. ఫేషియల్, త్రెడ్డింగ్, మెడిక్యూర్, పెడిక్యూర్, మేకప్ తదితర అంశాలలో పోటీలను నిర్వహించి, విజేతలకు పాఠశాల ఎస్ఓ సిహెచ్ భువన మాదిరి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. పాఠశాల స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఎనిమిది మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారని ఎస్ఓ తెలిపారు. ఒకేషనల్ టీచర్ లకే సునీత, పాల్గొన్నారు.

యువతకు వాలీబాల్ కిట్ వితరణ

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : పట్టణంలోని 19వ వార్డు యర్రవరంలో జనసేన నాయకులు గొర్లె సత్తిబాబు తన కుమారుడి జన్మదినం సందర్భంగా స్థానిక ఎన్జిఓ కాలనీ గ్రౌండ్లో యువకులతో పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు, మొబైల్ ఫోన్‌లకు బానిసలుగా మారకుండా ఉండాలన్నారు.

వైసిపి డిజిటల్ కో-ఆర్డినేటర్‌గా అప్పలరాజు

ప్రజాశక్తి-కోటవురట్ల : వైసిపి పాయకరావుపేట నియోజకవర్గం డిజిటల్ కో-ఆర్డినేటర్‌గా కోటవురట్ల మండలానికి చెందిన పెన్నడ అప్పలరాజును నియమించారు. ఆ మేరకు విజయవాడలో జరుగు శిక్షణ తరగతులకు హాజరవుతున్నట్లు ఈ సందర్భంలో ఆయన తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

రేపు చోడవరంలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా నవంబర్ 5న ఉదయం 9 గంటలకు చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్ గోవిందరావు, ఇంచార్జి డిఆర్వో ఎస్ సుబ్బులక్ష్మితో కలిసి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మెగా జాబ్ మేళా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మెగా జాబ్ మేళాలో సుమారుగా 17 బహుళ జాతి కంపెనీలు 1500 మందికి ఉపాధి కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ ఇంటర్వ్యూలకు పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, పిజి వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు హాజరు కావచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్తో పాటు రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు జెరాక్స్ కాపీలతో ఉదయం 9 గంటలకు జాబ్ మేళా జరుగు ప్రదేశానికి హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9494791935 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

సత్తిబాబు కుటుంబానికి భరత్ పరామర్శ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని గోపాలపురం గ్రామ వైసిపి అధ్యక్షులు కరణం సత్తిబాబు తండ్రి ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద్ సోమవారం పరామర్శించారు. సత్తిబాబు వారి ఇంటికి వెళ్లి వారిని ఓదార్చారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులు బాదపు హరి, బొండా సూరిబాబు, రేబాక శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తుపాన్ బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని కుమారపురం పంచాయతీ శివారు పెద్దూరు రత్నయ్యపేటలో మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా వేట నిషేధం వల్ల మత్స్యకారుల ఇబ్బందులను గుర్తించి సోమవారం నిత్యావసరాలు అందజేశారు. ఒక్కో మత్స్యకార కుటుంబానికి 50 కేజీల బియ్యం, కేజీ నూనె, కేజీ పంచదార, కేజీ కందిపప్పు, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళదుంపలు రేషన్ డిపో వద్ద పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాలుబాబు, సీనియర్ నాయకులు మజ్జూరి నారాయణరావు, నీలాపు మహేష్ రెడ్డి, వంకా రమణ, రావాడ గోవింద రెడ్డి, కుప్పులి సురేష్ రెడ్డి, గొల్లపల్లి నాగు, చవ్వాకుల వరహాలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక అయ్యన్న జూనియర్, డిగ్రీ కళాశాలల ఆధ్వర్యాన మండలంలోని జోగన్నపాలెం, కింతాడ గ్రామాల్లో చేపట్టిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఉత్సాహంగా సాగుతుంది. మూడో రోజు సోమవారం జోగన్నపాలెంలో జూనియర్ కాలేజీ వాలంటీర్లు స్వచ్ఛ భారత్ కార్యక్రమం, కింతాడలో డిగ్రీ కాలేజీ వాలంటీర్లు ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు. జోగన్నపాలెం శ్రమదానంతో రోడ్లకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేశారు. కింతాడలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆ గ్రామ ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వైద్య శిబిరంలో రోగులకు సేవలు అందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు గాడి అప్పారావు, సీముసురు రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సేవా కార్యక్రమంలో అధ్యాపకులు సుశీల, దుర్గాదేవి, కళ్యాణి, దీప్తి పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ప్రజా సమస్యలు పరిష్కారానికి చర్యలు

-హోంమంత్రి అనిత
-గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ


అర్జీలు స్వీకరిస్తున్న హో మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రజా సమస్యలు పరిష్కారానికి గ్రీవెన్స్ నిర్వహించినట్లు హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ ప్రత్యేక అధికారి శచీదేవి, మండల ప్రత్యేక అధికారి విజయతో పాటు నియోజకవర్గ వివిధ శాఖల అధికారులతో కలిసి గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల నుండి ప్రజలు వచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హెూం మంత్రి అనితకు అందచేశారు. అర్జీలను స్వీకరించారు. మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన మత్స్యకార నాయకులు మైలపల్లి మహేష్ బాబు, బి బాబ్జి, గోసల సోమేశ్వరరావు, కాశీ రావు, మాధవ,నరేష్, సూరిబాబు తదితరులు బల్క్ డ్రగ్ రద్దు చెయ్యాలని కోరుతూ హెూం మంత్రి అనిత కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిటీగా ఏర్పడితే సీఎం చంద్రబాబు నాయుడు దగ్గరకు తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.పంచాయతీ కార్యదర్శులు రాజయ్య పేటలో జరిగిన ఘటనపై హెూంమంత్రికి వినతిపత్రం అందజేసారు. వేంపాడు పిఎసిఎస్ భవనం శిథిలావస్థకు చేరుకుందని, నూతన భవనం మంజూరు చేయాలని పిఎసిఎస్ అధ్యక్షులు వెలగా ఈశ్వరరావు మంత్రికి అర్జీను అందజేసారు.చినతీనార్ల రెవిన్యూ పరిధిలో సుమారు 40 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఒక వ్యక్తి ఆక్రమించుకున్నారని, ఆక్రమణ ను తొలగించి ఆ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయాలని ఎంపీటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు మంత్రికి వినతిపత్రం అందజేశారు. సుమారుగా 400 వరకు అర్జీలు వచ్చాయి. ముందుగా నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో స్వర్ణాంధ్రఏ2047 నియోజకవర్గ అభివృద్ధి యాక్షన్ ప్లాన్, పి4 కేంద్రాన్ని నియోజకవర్గ ప్రత్యేక అధికారి శచీదేవి, మండల ప్రత్యేక అధికారి విజయ, తహసిల్దారు నరసింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజుతో కలిసి మంత్రి అనిత ప్రారంభించారు.


విద్యుత్ స్తంభంపై ఎగబాకిన తుప్పలు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కి అల్లుకున్న తుప్పలు

ప్రజాశక్తి -మాడుగుల:మాడుగుల మండల కేంద్రం లో బమిటిపాటి వీధుల్లో రోడ్డు పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ విద్యుత్ స్తంభానికి చాలా కాలం నుంచి తీగలు, తుప్పలు అల్లుకొని ప్రమాదకరంగా ఉన్నాయి. పాధచారులు, వాహన చోదుకులు ఆ తోవనే చాలా మంది నడుస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ఎప్పటి కప్పుడు విద్యుత్ సమస్య ఏర్పడుతుంది. ఏ సమస్య వచ్చిన అధికారులు వెల్లడానికి కూడా వీలు లేకుండా ఉంది. సంబంధించి అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలను, తుప్పలను తొలగించాలని స్థానికులు కోరారు.

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:పాతమలంపేట గ్రామంలో సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ జలమూరి రమణమ్మ పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామ ప్రజల ఆరోగ్య రక్షణ, పరిసరాల పరిశుభ్రత దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్వహించారు. గ్రామంలో వ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా బ్లీచింగ్ చల్లడం, చెత్త తొలగింపు పనులు చేపడుతున్నారు.

అధిక సెస్ వసూళ్లపై ఆందోళన

ప్రజాశక్తి-నర్సీపట్నం:నర్సీపట్నం పరిసర ప్రాంతాలలో ఏఎన్‌ఆర్ సంస్థ పేరుతో మైనింగ్ క్వారీల వద్ద అక్రమంగా మైనింగ్ సెస్ పేరున నిర్దేశించిన రుసుము కంటే అదనంగా సొమ్ము వసూలు చేస్తున్నారంటూ సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద జెసిబి యజమానులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంలో ఆందోళనకారులు మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా ఆమోదం పొందిన ప్రైవేటు సంస్థ మైనింగ్ క్వారీ వద్ద ఒరిజినల్ బిల్లులు ఇవ్వకుండా జెరాక్స్ కాపీలతో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ట్రాక్టర్ గ్రావెల్ కు 280 రూపాయలు వసూలు చేయాల్సి ఉండగా దాదాపు 500 వరకు వసూళు చేస్తున్నారని తెలిపారు. తప్పుడు బిల్లులు వసూలు చేయడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని, ప్రజలకు కూడా దీనిపై భారం పడుతుందని ఆందోళనకారులు అన్నారు. ఈ మేరకు ఆర్డీఓ వీవి రమణకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం తహసిల్దారు రామారావు, క్వారీ కూలీలు, జెసిబి యజమానులు పాల్గొన్నారు.


ఆందోళన చేపడుతున్న జెసిబి యజమానులు

ఉపమాకలో భారీ అన్న సమారాధన


భోజనాలు వడ్డిస్తున్న కంపెనీ ప్రతినిధులు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక శివాలయం వద్ద కార్తీక మాసం రెండవ సోమవారం పురస్కరించుకుని భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి శివపార్వతులను దర్శించుకున్నారు. అర్చకులు మహేష్, సంతోష్ భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. మధ్యాహ్నం ఆలయం వద్ద హెటిరో కంపెనీ యాజమాన్యం, భక్తుల ఆర్థిక సహాయంతో అన్న సమారాధన నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, గ్రామ పెద్దలు, యువత ఏర్పాట్లను పర్యవేక్షించి సహకరించారు. హెటిరో కంపెనీ ప్రతినిధులు ఎంవి సుబ్బారెడ్డి, ఎం ఎన్ వి ఎస్ రెడ్డి, హేమసుందరరాజు, శ్రీనివాస్‌లు శివపార్వతులను దర్శించుకుని, భక్తులకు భోజనాలు వడ్డించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైసిపి సంతకాల సేకరణ


సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణలో భాగంగా సోమవారం మాకవరపాలెం మండలంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు, సామాన్యులకు ఉచిత వైద్యం అందకుండా కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరించడం పట్ల తీవ్ర స్థాయిలో విమర్శించారు, ప్రైవేటీకరించడంతో పేద ప్రజలకు ఉచిత వైద్యం అందకుండా పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రా పాత్రుడు, ఎంపీపీ సర్వం, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ములగాడ : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సోమవారం పశ్చిమ నియోజకవర్గం 40వ వార్డు ఎకెసి కాలనీలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే, ,పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మళ్ళ విజయప్రసాద్ మాట్లాడుతూ, పేదలకు ప్రభుత్వ వైద్యం, వైద్యవిద్యను చేరువ చేయాలన్న లక్ష్యంతో మాజీ సిఎం జగన్మోహనరెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరుచేస్తే, వాటిలో పదింటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటుకు కట్టబెట్టాలని చూడడం దారుణమన్నారు.

పద్మనాభం.: నిరుపేదలకు ప్రభుత్వ వైద్యం అందకుండా కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఎం శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, 17 ప్రభుత్వ వైద్యకళాశాలలను మంజూరుచేసి, వాటిలో ఐదింటిని వైసిపి ప్రభుత్వం పూర్తిచేస్తే, మిగిలిన వాటిని నిర్మించలేక చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం ప్రైవేటుకు కట్టబెట్టాలని చూస్తోందని మండిపడ్డారు. దీనిపై కోటి సంతకాల సేకరణలో భాగంగా ఈనెల 11న తగరపువలసలో అంబేద్కర్ విగ్రహం నుంచి భీమిలి ఆర్‌డిఓ కార్యాలయం వరకు బైక్‌ర్యాలీ, కోటిసంతకాల సేకరణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కె.లక్ష్మణరావు, జెడ్‌పి వైస్‌చైర్మన్ గిరిబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి : రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారం దేవరాపల్లి మండల కేంద్రంలో నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు మెడికల్ విద్యను, వైద్య సేవలను ప్రైవేటు వారి చేతుల్లో పెట్టడం దారుణమన్నారు. ఎంపిపి చింతల బుల్లిలక్ష్మి, జడ్పీటీసీ కర్రి సత్యం, వైసిపి నాయకులు వరదపురెడ్డి లలితానాయుడు, కోటాన వెంకటరమణ వేచలపు శ్రీవాణి, బూరె బాబురావు, గొర్రెపోటు రమాదేవి, గంగవంశం సంతోష్, కోరుపోలు శ్రీను, అప్పలనాయుడు పాల్గొన్నారు.


రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు

రోడ్డుకిరువైపులా తుప్పలు తొలగించరూ..

ప్రజాశక్తి -మాడుగుల:మాడుగుల నుండి ఖండివరం గ్రామాలకు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి తుప్పలు పేరుకుపోయి ఉన్నాయి. ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద అవతల నుంచి వచ్చే వాహనదారులు కనిపించక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధించి అధికారులు తుప్పలను తొలగించాలని పలువురు కోరారు.

పేదలకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- రావికమతం: స్థానిక నవోదయ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ జె. చంద్రశేఖర పట్నాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన చుక్క రాము కుమార్తె రాణి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని నిరు పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పలువురుకి 10 కేజీల బియ్యం, పంచదార, కందిపప్పు, పెసరపప్పు, శనగపప్పు తదితర సరుకులు అందజేశారు.


సరుకులు ఇస్తున్న దాతలు


హాజరైన పిల్లలు

ఉత్సాహంగా బాలల పోటీలు

ప్రజాశక్తి -నర్సీపట్నం: పిఆర్‌టియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రతిభా పాటవాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేమన సుమతి శతకాల నుంచి విద్యార్థులు పద్య పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా అధ్యక్షులు గోపీనాథ్, రమణ, సంతోషి, లక్ష్మణ్ పాల్గొన్నారు.


నగదును ఇస్తున్న పాత్రికేయులు

పాత్రికేయునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చీడికాడ:పాత్రికేయుని కుటుంబానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రెస్ క్లబ్ తరఫున ఆర్థిక సహాయం అందజేశారు. చీడికాడ మండల కేంద్రంలో నివాసముంటున్న నీలగిరి వార్త దినపత్రిక రిపోర్టర్‌గా మజ్జి నరేష్ కుమార్ పనిచ చేస్తున్నారు. ఆయన సతీమణి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో నరేష్ కుటుంబానికి మాడుగుల చోడవరం ప్రెస్ క్లబ్ తరఫున తోటి పాత్రికేయులు 11 వేలు నగదును నరేష్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో శర గడం రాజు తాత నాయుడు, వాసు, కరక అప్పలనాయుడు, మహాలక్ష్మి నాయుడు, కే.దేములు, అజయ్ ప్రసాద్ ఎస్.గోవింద, గంగరాజు, గోవిందా పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు, నాయకులు

మహిళలకు రక్షణ కల్పించాలి

-విద్యార్థి సంఘాల ఆందోళన

ప్రజాశక్తి -నర్సీపట్నం: మహిళలకు, విద్యార్థులకు రక్షణ కల్పించాలని సోమవారం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో వివి రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ, మహిళలు, బాలికలపై అత్యాచారాలు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని అన్నారు. మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంప్లెక్స్, శివపురం హాస్టళ్ల ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. డివైఎఫ్ఐ నేత గీత కృష్ణ మాట్లాడుతూ, సోషల్ మీడియాలో వస్తున్న అశ్లీల దృశ్యాలు నిరోధించాలని, మద్యపానం, డ్రగ్స్ వంటి వాటిని నియంత్రించాలన్నారు, ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జనార్ధన్, భార్గవ్, రాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భాగ్యశ్రీ ఎంపిక

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం మేడి వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎమ్ భాగ్యశ్రీ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు ఎంపిక అయ్యింది. మూడు రకాల అథ్లెటిక్స్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి ఈ ఘనత సాధించింది. విశాఖ ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ గ్రౌండ్ కైలాసగిరిలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని మోపాడ భాగ్యశ్రీ అండర్ - 17 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెం తో పాటు 200 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని మొదటి స్థానం సాధించింది. అత్యంత ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల హెచ్ఎమ్ వంకాయల రామారావు తెలిపారు. భాగ్యశ్రీని వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్ మధుసూదన్, ఎస్.విశ్వనారాయణరాజ్, ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, నాగేశ్వరరావులు అభినందించారు.



ఎంపికైన భాగ్యశ్రీ



ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వృత్తి విద్యతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి- నక్కపల్లి: వృత్తి విద్యతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్య కుమార్ అన్నారు. మండలంలో గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9,10 తరగతుల విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి సోమవారం స్కిల్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ శిక్షను అభ్యశిస్తున్న విద్యార్థులు వర్కింగ్ మోడల్ ప్రాజెక్ట్స్ తయారుచేసి ప్రదర్శించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ఉపాధ్యాయులు పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్య ఉపాధ్యాయులు యం. సాయి చందు, బి.లలిత పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్‌ను రద్దు చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి- నక్కపల్లి: మత్స్యకారుల ఉపాధి, ఉనికిని దెబ్బతీస్తే బల్క్ డ్రగ్‌ను రద్దు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాణిక్యం, వరలక్ష్మి డిమాండ్ చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారుల తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు సోమవారం నాటికి 51 వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు ఐద్వా నాయకులు సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఇప్పటికే సముద్రం కలుషిత బారిన పడడంతో చేపలు నశించిపోయి, మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోయిందని, కాలుష్యం కారణంగా అనేక అనారోగ్య సమస్యలతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే మత్స్యకారుల జీవితాలు సర్వనాశనం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ జిల్లా కమిటీ సభ్యులు మంగ, లక్ష్మి, మత్స్యకార నాయకులు మైలపల్లి మహేష్ బాబు, బి బాబ్జి, పిక్కి తాతీలు, గోసల సోమేశ్వరరావు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఐద్వా మహిళా నేతలు, మత్స్యకారులు

విద్యార్థి దశ భవిష్యత్తుకు పునాది

ప్రజాశక్తి-చింతపల్లి : విద్యార్థి దశ భవిష్యత్తుకు పునాది వంటిదని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.విజయభారతి అన్నారు. కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం స్టూడెంట్స్ ఇండక్షన్ ప్రోగ్రాం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో లభ్యమయ్యే విద్యా వసతులు, ఆధునిక ప్రయోగశాలలు, డిజిటల్ లైబ్రరీ, క్రీడా మైదానం, కంప్యూటర్ ల్యాబ్ వంటి సౌకర్యాలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.

పట్టాలివ్వాలని వినతి

ప్రజాశక్తి -నర్సీపట్నం: పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని మాడుగుల మండలం లోవపొన్నవోలు, ఒంద్రువీది, దుబ్బూరు గ్రామాల గిరిజన రైతులు సోమవారం ఆర్డీఓను కలిసి వినతి పత్రం అందజేశారు సుమారు యాభై సంవత్సరాలుగా సర్వేనెంబర్ 47లో 199 ఎకరాలలో వరి జీడి మామిడి తదితర పంటలో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు అధికారులతో సర్వే నిర్వహించి భూమిపై ఆధారపడి బతుకుతున్న రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, సిపిఐ నాయకులు కొండబాబు, నీలకంఠం పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న నేతలు

డిఫారం, సాగు భూముల్లో తోటలకు, చెట్లకు

పరిహారం చెల్లించాలని వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి మండలంలో వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన డిఫారం, సాగు భూముల్లో గల తోటలకు చెట్లకు పరిహారం చెల్లించాలని డి.ఎల్.పురం మాజీ ఎంపీటీసీ సభ్యులు గింజాల వెంకటరమణ కోరారు. అమరావతి సెక్రటేరియట్ లో రాష్ట్ర పరిశ్రమలు శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.యువరాజు ను సోమవారం మాజీ ఎంపీటీసీ సభ్యులు గింజాల వెంకటరమణ కలిసి వినతిపత్రం అందజేశారు. నక్కపల్లి మండలంలో రాజయ్యపేట, డి.ఎల్. పురం, చందనాడ, వేంపాడు, బుచ్చిరాజుపేట రెవెన్యూ గ్రామాలలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ అధికారులు భూసేకరణ చేపట్టడం జరిగిందన్నారు. ఈ భూసేకరణలో జిరాయితీ భూములు, డి-ఫారం భూములు, సాగు భూములను సేకరించారని, జిరాయితీ, డి-ఫారం భూములకు నష్టపరిహారం చెల్లించారని, జిరాయితీ భూములలో ఉన్న తోటలకు కూడా నష్టపరిహారం చెల్లించడం జరిగిందన్నారు. డి-ఫారం, సాగు భూముల్లో గల తోటలకు, చెట్లుకు నేటికి నష్టపరిహారం చెల్లించలేదని, గతంలో అనేక పర్యాయాలు అనకాపల్లి జిల్లా కలెక్టర్,నర్సీపట్నం ఆర్.డి.ఓ.నక్కపల్లి తహశీల్దార్ లకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని, నేటి వరకు నష్ట పరిహారం చెల్లించలేదన్నారు. డి-ఫారం,సాగు భూములలో గల తోటలకు, చెట్లకు నష్టపరిహారం చెల్లించకుండా తొలగించవద్దని విజ్ఞప్తి చేశారు.



యువరాజుకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటరమణ

దేశ ఆర్థిక వ్యవస్థకు పరిశ్రమలు కీలకం

కేంద్ర సహాయ శాఖ మంత్రి భూపతి శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి -కశింకోట : భారతదేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పరిశ్రమలు చాలా కీలకమని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కుశాఖ సహాయ శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ అన్నారు. కశింకోట మండలం, తాళ్ళపాలెంలో నూతన ఏర్పాటు చేసిన నాగార్జున సిమెంట్ కంపెనీని సోమవారం ఆయన ప్రారంభించారు. కంపెనీలో పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడి ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోనే కొనసాగిస్తామని చెప్పారు. విశాఖ ఉక్కును గాడిలో పెట్టడానికి, పటిష్టం చేయడానికి కేంద్ర ప్రభుత్వం రూ.1140 కోట్లు ప్యాకేజీ అందించినట్లు తెలిపారు. నక్కపల్లిలో మిట్టల్ ఉక్కు పరిశ్రమకు డిసెంబర్ నెలలో భూమి పూజ జరుగుతుందన్నారు. ఈ పరిశ్రమకు సంబంధించిన అన్ని అనుమతులు సంవత్సరంలోపే మంజూరు చేస్తామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించే విధంగా విశాఖలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో సమ్మిట్ జరగనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఫైనాన్సల్ ఆఫీసర్ ప్రసాద్, ప్లాంట్ హెడ్ నరసింహరావు, ప్రాజెక్టు హెడ్ కిరణ్, జనరల్ మేనేజర్ రవిశంకర్, హెచ్ఆర్ రాజా పాల్గొన్నారు.



నాగార్జున సిమెంట్ పరిశ్రమను పరిశీలిస్తున్న శ్రీనివాసవర్మ

యువతలో క్రీడాసక్తిని ప్రోత్సహించాలి

కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని యువతలో క్రీడల పట్ల ఆసక్తిని ప్రోత్సహించి మంచి క్రీడాకారులను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ క్రీడాభివృద్ధి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జిల్లా స్థాయి జిల్లా క్రీడాభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే అద్భుతంగా రాణిస్తారన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా క్రీడల వైపు మొగ్గు చూపే విధంగా క్రీడా మైదానాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. 24 మండల కేంద్రాల్లో 25 క్రీడా ప్రాంగణాలకు 25 సెంట్లు చొప్పున భూమిని సేకరించాలని జెడ్పి సిఇఒను ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి 24 మండల కేంద్రాల్లో 10 నుండి 15 సెంట్లు చొప్పున 31 క్రీడా ప్రాంగణాలను నిర్మించడానికి ప్రతిపాదించిన భూమిని మండలాల వారీగా మండల స్పెషల్ ఆఫీసర్, పిఇటి/పిడిలతో సమగ్రంగా పరిశీలించి సాధ్యాసాధ్య నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెసి జాహ్నవి, డిఆర్ఒ వై.సత్యనారాయణరావు, జిల్లా క్రీడాల అభివృద్ధి అధికారి పూజారి శైలజ, జెడ్పి సిఇఒ నారాయణమూర్తి, డిపిఒ సందీప్, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి మంజుల వాణి, డ్వామా పీడీ పూర్ణిమా దేవి, యలమంచిలి, నర్సీపట్నం మునిసిపల్ కమిషనర్లు, జివిఎంసి అనకాపల్లి జోనల్ కమిషనర్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ నరసింహ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతన్నల ఇక్కట్లు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలో పలు గ్రామాల్లో రైతులు యూరియా కోసం తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాలలో యూరియా దొరకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయం ధర్మవరం, తిమ్మాపురం రైతు సేవా కేంద్రాలలో యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. చిన్న సన్నకారు కౌలు రైతులకు యూరియా అందలేదని వారు వాపోతున్నారు. అధికార పార్టీ నాయకుల అండతో మండలస్థాయి నాయకులకే ఎక్కువ మొత్తంలో యూరియా పట్టుకెలుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఒక్కొక్క నాయకుడు పదినుండి పదిహేను బస్తాలు ఆటోల్లో తరలించారని ఆరోపిస్తునామ్నరు. అధికారుల మాటలకు జరుగుతున్న పనులకు చాలా తేడా ఉందని రైతులు వాపోతున్నారు.



ఆర్ఎస్‌కె వద్ద యూరియా కోసం పెద్ద సంఖ్యలో ఉన్న రైతులు